సాక్షి
కాకినాడ

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



ఆట మొదలైంది

8 లో

పాఠశాల, కళాశాల స్థాయి క్రీడలకు రంగం సిద్ధమైంది. ఈ పోటీలు కోనసీమ జిల్లాలో అండర్-14, 17, 19 విభాగాల్లో జరగనున్నాయి.



ఏలేరు నుంచి నీరు విడుదల

ఏలేశ్వరం: ఏలేరు నుంచి వరదనీరు శుక్రవారం దిగువకు 4875 క్యూసెక్కులను వదిలారు. 86.56 మీటర్లకు 85.80 మీటర్లు, 24.11 టీఎంసీలకు 22.56 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి.

అంతర్వేదిలో పవిత్రోత్సవాలు



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయంలో శుక్రవారం స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు రెండో రోజు కొనసాగాయి. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహ వచనం నిర్వహించారు. పురాతన కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులకు పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా యాంకర్ శ్యామల



కాకినాడ: పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆర్.శ్యామల నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్యామలను శుక్రవారం నియమించారు. కాకినాడ ఇంద్రపాలేనికి చెందిన శ్యామల బుల్లితెర నటిగా, యాంకర్‌గా పేరు సంపాదించుకున్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఆమె పార్టీ తరఫున కాకినాడ జిల్లాలో ప్రచారం చేశారు.

జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓగా నారాయణమూర్తి



జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును కలిసిన సీఈఓ నారాయణమూర్తి

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓగా పాటంశెట్టి నారాయణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జెడ్పీ సీఈవోగా పనిచేసిన ఎ.శ్రీరామచంద్రమూర్తి ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా కాకినాడకు వచ్చారు. తిరిగి తన మాతృశాఖ రెవెన్యూలో జేఏడీకి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో కాకినాడ డివిజనల్ డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తున్న నారాయణమూర్తి జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావుని మర్యాదపూర్వకంగా కలిశారు.

పీజీఆర్ఎస్ రద్దు

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను వచ్చే సోమవారం రద్దు చేసినట్టు కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 16న ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా రద్దు చేసినట్టు ఆయన తెలిపారు.

డ్వాక్రా మహిళల విరాళం

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడ వరద బాధితులకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ డ్వాక్రా మహిళా సంఘాలు రూ.6.5 లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి శుక్రవారం ఆయన నివాసంలో కడియం, రూరల్ మండలాల డ్వాక్రా సంఘాల ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వికాస విరాళం

కాకినాడ సిటీ: ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల నిమిత్తం వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు రూ.1.26 లక్షల చెక్కును శుక్రవారం కలెక్టర్ షణ్మోహన్‌కు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో అందజేశారు. ఈ మొత్తాన్ని వికాస ద్వారా అనంతపురం జిల్లా సిటీ కియా సైట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు వారి జీతాల నుంచి స్వచ్ఛందంగా అందజేశారని లచ్చారావు తెలిపారు.

18న జాబ్‌మేళా

నిడదవోలు: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థల ఆధ్వర్యంలో నిడదవోలు పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలైన అరబిందో ఫార్మా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ తదితర సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 27 ఏళ్ల లోపు అభ్యర్థులు హాజరుకావాలని ఆమె కోరారు. అభ్యర్థులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 96760 52454, 7396740041 నంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు.

నేడు, రేపు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో 11వ ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలు శని, ఆదివారాల్లో జరుగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయి. క్లాసిక్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. అమలాపురానికి చెందిన హైదరాబాద్, విశాఖ మెట్రో కెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరావు సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.



పిఠాపురం హెలిప్యాడ్ వద్ద ప్రియతమ నేతను కలిసేందుకు వచ్చిన పార్టీ శ్రేణులు



కొత్తపల్లి మండలం నాగులాపల్లిలో పర్యటిస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



పిఠాపురంలో జగన్‌ను చూసిన ఆనందంలో..

అన్నదాతకు అభయం

- ముంపు ప్రాంత బాధితులకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం జగన్
- పిఠాపురం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటన
- సమస్యలు ఏకరువు పెట్టిన అన్నదాతలు, ప్రజలు
- ఘన స్వాగతం పలికిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

గతంలో అడగకుండానే సాయం..

గతంలో అయితే అధికారులే మా దగ్గరకు వచ్చి వంట నమోదు చేసి మా పంటలకు నష్ట పరిహారం అడగకుండానే ఖాతాల్లో వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదంటూ రైతులు జగన్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. అడుగడుగునా జనం ఆపి తమ ఆవేదనను వెళ్లబుచ్చడంతో మూడు గంటల్లో ముగియాల్సిన జగన్ పర్యటన ఆరు గంటల పాటు సాగింది. ప్రతి గ్రామంలోనూ గంటన్నర నుంచి రెండు గంటల పాటు పర్యటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దారి పొడవునా పొలాల్లో రైతులు జగన్‌ను ఆపి తమ పంటలు మునిగిపోయాయి.. ఇక మీరే మాకు దిక్కు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పిఠాపురం/కొత్తపల్లి: ఏలేరు వరద బీభత్సం సృష్టించిన పిఠాపురం నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. కొత్తపల్లి మండలం మాదాపురం, ఇసుకపల్లి, నాగులపల్లి, రమణక్కపేట గ్రామాల్లో వరద ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు ఆయనకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల మైదానంలో హెలికాప్టర్‌లో దిగిన ఆయన కారులో పిఠాపురం మీదుగా పిఠాపురం మండలం మాదాపురం చేరుకున్నారు. హెలిపాడ్ వద్ద పిఠాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

స్థానిక రైతులకు భరోసా

మాదాపురంలో వరద నీటిలో మునిగిన పంటలను పరిశీలించి ఆయన స్థానిక రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామ సర్పంచ్ బండి వెంకట సుబ్బారావు గ్రామంలో సంభవించిన వరద నష్టాలను వివరించారు. అనంతరం ఆయన పాత ఇసుకపల్లి చేరుకుని ఆ గ్రామంలో ముంపులో ఉన్న పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నాగులపల్లి చేరుకుని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. నాగులపల్లిలో పలువురు పార్టీ నాయకులు గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికి వరదల వల్ల తమ గ్రామంలో పంటలు నీట మునిగాయని, ఇళ్లల్లోకి నీరు వచ్చిందని, చాలా ఇబ్బందులు పడ్డామని వివరించారు. నాగులపల్లిలో సీఎం సీఎం అంటూ స్థానికులు నినాదాలు చేశారు. అక్కడ నుంచి ఆయన నాగులాపల్లి రమణక్కపేట రహదారిలో వెళ్తూ వరద నీరు పోటెత్తడంతో ట్రాక్టర్‌పై రమణక్కపేట బయలుదేరి వెళ్లి అక్కడ ముంపులో ఉన్న పంటలను పరిశీలించి ఎన్ని ఎకరాలు నీట మునిగాయి.. ఎంత నష్టం సంభవించింది తదితర వివరాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లోనూ జగన్ వస్తున్నారన్న విషయం తెలుసుకుని స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి తమ సమస్యలు విన్నవించుకోడానికి ప్రయత్నించడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు ఇబ్బందిగా మారింది. ప్రతి ఒక్కరు వరదల వల్ల కలిగిన నష్టాన్ని చెప్పుకున్నారు. అందరికీ అభివాదం చేసిన ఆయన నేను ఉన్నాను అంటూ భరోసా ఇచ్చారు.

జగన్ కోసం ఎదురుతెన్నులు..

పిఠాపురం నియోజకవర్గానికి శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనకు వస్తున్నారని తెలిసి ఉదయం 9 గంటల నుంచి ప్రజలు గుంపులు గుంపులుగా ఎదురుచూశారు. ప్రతి గ్రామంలోనూ రోడ్లపైకి వచ్చిన జనం ఆయన రాక కోసం ఎదురుచూస్తూ తమ సమస్యలు విన్నవించేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. పిల్లలు పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి అభిమాన నేత కోసం ఎదురుచూసి ఆయన రాగానే ఉద్వేగానికి గురై ఒక్క సారిగా తమ బాధలను ఏకరవు పెట్టారు. దీంతో ఆయన షెడ్యూల్ సమయం కంటే ఎక్కువ సమయం గడిపి ప్రతి ఒక్కరి సమస్యా విని నేనున్నానంటు మనో ధైర్యాన్ని ఇచ్చారు. ఒక పక్క వరద నీటిలో ఇళ్లు మునిగిపోయి ఊళ్లన్నీ నీట మునిగి ఉన్నా తమ ప్రియతమ నేత రాక కోసం వరదనీటిలోనే ఈదుకుంటూ మరీ వచ్చి ఆయన తమ సమస్యలు విన్నవించుకున్నారు.

తిండీ తిప్పల్లేవు.. ఆదుకునేవారు లేరు..

మూడు రోజుల నుంచి వరద నీటిలో ఉండిపోయాం. ఇంట్లోంచి బయటికి రాలేదు. నాకు లేదు తిండి లేదు. కరెంటు లేదు. మమ్మల్ని పట్టించుకుండేవారు లేరు అంటూ జగన్ వద్ద బాధితులు వాపోయారు. మా పంటలన్నీ నీటిలో మునిగాయి ఏ ఒక్క అధికారీ వచ్చిన పాపానపోలేదు. మమ్మల్ని పట్టించుకున్న వారు లేరు. మా పంటలను రక్షించుకోవాలని మేము ప్రయత్నం చేసుకోవడం తప్ప ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ పలు రైతులు జగన్ వద్ద వాపోయారు. అంతా జలమయం కావడంతో మూగ జీవాలు, పశువులకు కూడా మేత లేకుండా పోయింది.



నాగులాపల్లిలో ముంపు నీటిలో పర్యటిస్తున్న జగన్

కనీసం దాణా లేదు, పచ్చగడ్డి కానీ, ఎండుగడ్డి కానీ వేసే అవకాశం లేదు. దీంతో పశువులు ఆకలితో అలమటిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు అంటూ రైతులు జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మా గ్రామంలో ఈ క్రాప్ నమోదు జరగలేదు. ఎక్కడ చేస్తున్నారో.. ఎప్పుడు చేస్తున్నారో.. ఎవరు చేస్తున్నారో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నాం. ఈ క్రాప్ నమోదు లేకపోతే పంట నష్ట పరిహారం రాదంటున్నారు. ఇలాగైతే మాకు పైసా కూడా రాదు. తిరిగి అప్పులు చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.



మహిళ గోడు వింటున్న జగన్

ప్రతి సమస్యనూ వింటూ.. ధైర్యం చెప్తూ..

స్థానికులు తమ ఇళ్ల వరదల్లో మునిగిపోయి తిండి తిప్పలు లేకుండా నరకం చవిచూస్తు న్నామంటూ జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం విరామం కూడా తీసుకోకుండా ఆయన వరద బాధితుల సమస్యలు సావధానంగా విన్నారు. మీకు అందరికీ నేనున్నాను మీకు అండగా ఉంటాను అంటూ భరోసా కల్పించారు.

ఎండవేడిమితో అలసిపోయి జనసందోహం మధ్య ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ద్విచక్ర వాహనాలపై కాన్వాయ్ వెంట ఉన్నారు. బాధితులు పెద్ద ఎత్తున తరలిరావడంతో జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. కన్నబాబు కాన్వాయ్ నుంచి కిందకు దిగి నాయకులను ముందుకు పంపించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్, మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ, పిఠాపురం కో ఆర్డినేటర్ వంగా గీతవిశ్వనాథ్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, అనంతబాబు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి, తోట నరసింహం, నాగులాపల్లి ధనలక్ష్మి, గొల్లపల్లి సూర్యారావు, పాముల రాజేశ్వరి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు దవులూరి దొరబాబు, పిల్లి సూర్యప్రకాష్‌రావు, రుడా, కొడా మాజీ చైర్‌పర్సన్లు మేడపాటి షర్మిలారెడ్డి, రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు, నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, సుంకర శివప్రసన్న, కాశి మునికుమారి, పెదపాటి అమ్మాజీ, గిరజాల బాబు, కర్రి పాపారాయుడు, పిల్లంక శ్రీనివాస రాజు, గుబ్బల తులసీకుమార్, ఉలవకాయల లోవరాజు, సాకా ప్రసన్నకుమార్, డేవిడ్‌రాజు, నాగం దొరబాబు, సంకిన భవానీ ప్రియ, జెడ్పీ వైస్ చైర్మన్లు అనుబాబు, మేరుగు పద్మలత తదితరులున్నారు.



కొత్తపల్లి మండలం ఇసుకపల్లిలో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న జగన్



నాగులాపల్లిలో మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి

నట్టేట ముంచారు

పాత ఇసుకపల్లి వద్ద బిళ్లకుర్తి రామకృష్ణారెడ్డి కుళ్లిపోయిన వరి కంకులతో జగన్‌కు ఎదురుపడ్డాడు. నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగుచేస్తూ పెట్టిన లక్ష పెట్టుబడి గంగపాలైందంటూ జగన్ వద్ద విలపించాడు. పంటలన్నీ నీటిలో మునిగినా ఏ ఒక్క అధికారి వచ్చిన పాపాన పోలేదని కన్నీటి పర్యంతమయ్యాడు.. పెట్టుబడి ఎకరాకు రూ .30 వేలు అయ్యింది. ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇస్తామంటోంది. ఆ సొమ్ము ఏ మూలకు వస్తుందని జగన్ వద్ద విలపించాడు.

ఆకలితో అలమటిస్తున్నాం

మా ఇళ్లు మునిగిపోయినా ప్రభుత్వం పట్టించుకోలేదని పాత ఇసుకపల్లిలో నున్న సీత మాజీ ముఖ్యమంత్రి వద్ద కన్నీరు పెట్టుకుంది. మూడు రోజులుగా తమ ఇల్లు వరదల్లో మునిగిపోయి తిండి తిప్పలు లేకుండా నరకం చూస్తున్నామంటూ జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. మూడు రోజులుగా కరెంటు లేదు మమ్మల్ని పట్టించుకునేవారు లేరంటూ సీత విలపించింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు

జగన్‌మోహన్‌రెడ్డి ఇసుకపల్లి నుంచి నాగులాపల్లి వచ్చేసరికి కుళ్లిన వరి కంకులను చూపిస్తూ రైతు యరకం ప్రసాదరెడ్డి కన్నీరు పెట్టుకున్నాడు. వరద నీటిలో మూడు రోజులుగా నానుతున్న వరి దుబ్బులను తీసుకువచ్చి జగన్‌కు చూపించి వరదొచ్చి మూడు రోజులైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని వివరించాడు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడులు అయ్యాయి. అంతా నష్టపోయామని మీరే మా తరఫున ప్రభుత్వంపై పోరాటం చేయాలని అభ్యర్థించాడు.

ఆల్బెండజోల్ పంపిణీ చేయాలి



జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఈనెల 17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లాలో 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శుక్రవారం ఆదేశించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో 1986 అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల కింద గల 1864 పాఠశాలలు, 125 జూనియర్ కళాశాలలు, 55 డిగ్రీ కళాశాలలు, 39 సాంకేతిక విద్యా సంస్థలతో పాటు బడిలో నమోదు కాని బాలలు సుమారు 4,73,859 మంది బాలబాలికలందరికీ ఈ మాత్రలు వేయాలన్నారు. 30వ తేదీన తమ విద్యా సంస్థలో పిల్లలు ప్రతి ఒక్కరికీ ఆల్బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశామనే ధ్రువీకరణ తమకు సమర్పించాలని ఆదేశించారు. ఈ నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

17న విశ్వకర్మ జయంతి

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న విశ్వకర్మ జయంతిని కలెక్టరేట్ వివేకానంద సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

కాపుల వల్లే గెలిచాను

- శెట్టిబలిజ ఆత్మీయ సమావేశంలో మంత్రి సుభాష్
- అవాక్కయిన ఆ సామాజిక వర్గీయులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి శెట్టిబలిజ సామాజిక వర్గీయులు పెద్దగా వస్తారని స్టేజీపై ముందుగా సుమారు 30 కుర్చీల వరకూ వేశారు. సమావేశానికి తక్కువ మంది రావడంతో స్టేజీపై మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యంలు మాత్రమే కూర్చునే విధంగా రెండు కుర్చీలకు పరిమితం చేశారు. రామచంద్రపురం శెట్టిబలిజ సంఘానికి అధ్యక్షుడిగా స్వయం ప్రకటన చేసుకుంటున్న మంత్రి సుభాష్ అనుచరుడు దొంగల శ్రీధర్‌తో కలసి రావడంతో కొందరు కాజులూరు మండలానికి చెందిన వారు శ్రీధర్‌తో కలసి రావడమేంటని ప్రశ్నించారు. దీనితో అతడిని స్టేజీపై లేకుండా జాగ్రత్త పడ్డారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ తన గెలుపుపకు కృషి చేసిన మీకందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానంటూనే తన గెలుపునకు ప్రముఖంగా కాపులే కృషి చేశారని, ఆ తరువాత మిగిలిన కులాలతో పాటు 35 శాతం శెట్టిబలిజలు తన గెలుపునకు కృషి చేశారని అనడంతో సభలోని వారు అవాక్కయ్యారు. శెట్టిబలిజల సమావేశంలో కాపుల ప్రస్తావన ఎందుకు అంటూ గుసగుసలాడుకున్నారు. శెట్టిబలిజ కులానికి చెందిన భీమేశ్వరాలయ ఈఓను తాను సస్పెండ్ చేయించానని శెట్టిబలిజ కులస్తులు కొందరు తనపై ప్రచారం చేస్తున్నారని, దొంగల శ్రీధర్‌ను తాను ప్రోత్సహించనని మంత్రి అనడంతో మరి పక్కనే తిప్పుకొంటున్న ఇసుక దొంగల సంగతేంటని సభలో కామెంట్లు వచ్చాయి. శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణపై మంత్రి సుభాష్ వయసును కూడా చూడకుండా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో ఈ మంత్రి తీరు మారదంటూ సమావేశంలో కొందరు మాట్లాడుకున్నారు. తన కోసం పనిచేసిన వారికి చదువులు, ఉద్యోగాల విషయంలో సహకరిస్తానని మంత్రి సుభాష్ తెలిపారు.



రామచంద్రపురం శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనంలో స్టేజీపై మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యం

విజయమివ్వు విఘ్నేశ్వరా..



మూషిక వాహనంపై అయినవిల్లి విఘ్నేశ్వరుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నవరాత్ర వేడుకల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం స్వామివారికి పుష్పాలంకరణ ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి లఘున్యాస, ఏకాదశ, రుద్రాభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, పంచామృతాభిషేకాలు చేశారు. మాఢవీధుల్లో స్వామిని మూషిక వాహనంపై ఊరేగించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీప్రియతో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

కె.గంగవరం: రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు మండల పరిధిలోని కుందూరు ఉన్నత పాఠశాల విద్యార్థి గుబ్బల కుందన లక్ష్మీప్రియ ఎంపికైనట్లు హెచ్ఎం చింతలపూడి ఆదినారాయణ తెలిపారు. ఇటీవల రావులపాలెం మండలం ఊబలంకలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గ్రూప్‌– ఏ విభాగంలో హైజంప్, లాంగ్ జంప్, 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొనుందని ఆయన పేర్కొన్నారు. లక్ష్మీప్రియను ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, ఎస్ఎంసీ చైర్మన్ వెంకట సత్యనారాయణ, వ్యాయమ ఉపాధ్యాయుడు అయినపర్తి వీర వెంకట సత్యనారాయణ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గొల్లపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్

కాజులూరు, రాయవరం: కాకినాడ– కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం శలపాక జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసుల కథనం ప్రకారం.. పసలపూడికి చెందిన కుడుపూడి శ్రీనివాస్ (41) కరప మండలం కొంగోడులో నివాసముంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చాడు. మనుమరాలి పుట్టినరోజు కావటంతో ఆ చిన్నారిని బైక్‌పై కూర్చోబెట్టుకుని గొల్లపాలెంలో చాక్లెట్లు కొనేందుకు తీసుకువెళ్లాడు. తిరిగి వస్తుండగా శలపాక జంక్షన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ సంఘటనలో మనుమరాలు స్వల్ప గాయాలతో బయటపడగా, శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్సై డేవిడ్ సంఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ దర్యాప్తు చేస్తున్నారు.

ఆట మొదలైంది

- ఎస్‌జీఎఫ్ క్రీడలు ఆరంభం
- అండర్‌–14, 17, 19 విభాగాల్లో పోటీలు
- గ్రిగ్ పోటీల నిర్వహణకు సన్నాహాలు
- త్వరలో అసోసియేషన్ క్రీడలు



ఎస్‌జీఎఫ్‌లో భాగంగా వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

సాక్షి, అమలాపురం: ఆట ఆరంభమైంది.. పాఠశాల, కళాశాల స్థాయి క్రీడలకు రంగం సిద్ధమైంది. తొలుత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్) పోటీలు మొదలయ్యాయి. తరువాత ఆయా క్రీడలకు చెందిన అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకూ కసరత్తు జరుగుతోంది. పదేళ్లుగా నిలిచిపోయిన జోనల్ గ్రిగ్ పోటీలను సైతం నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎస్‌జీఎఫ్ క్రీడలు మొదలయ్యాయి. ఈ జిల్లాలో 217 పాఠశాలల నుంచి, తూర్పుగోదావరి జిల్లాలో 154, కాకినాడ జిల్లా నుంచి 180 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనున్నారు. వీరితోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు చెందిన క్రీడాకారులు సైతం పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించనున్నారు. తొలుత మండల స్థాయి, తరువాత నియోజకవర్గ, ఉమ్మడి జిల్లా స్థాయిలో జరుగనున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారు. తరువాత వీరు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశముంది. అండర్‌–14, 17, 19 విభాగాల్లో బాలుర, బాలికలకు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1,800 మంది వరకూ పాల్గొనున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో పోటీలు మొదలయ్యాయి. మండల స్థాయిలో ఏడు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయి. మిగిలిన క్రీడాంశాలు నియోజకవర్గ స్థాయి, హేమర్ త్రో, పోల్ వాల్ట్, స్విమ్మింగ్ మాత్రం ఉమ్మడి జిల్లా స్థాయిలో మాత్రమే నిర్వహించనున్నారు.

సర్టిఫికెట్ కోసం..

ఇంజినీరింగ్, మెడికల్ వంటి సీట్ల భర్తీకి స్పోర్ట్స్ కోటా ఉంది. ఐఐటీ, ఎన్ఐటీ వంటి సంస్థల్లో ప్రవేశాలకు సైతం స్పోర్ట్స్ కోటా ఉంది. ఎంపిక చేసిన కొన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాలో భర్తీకి ఎస్జీఎఫ్ సర్టిఫికెట్ చాలా విలువైంది. దీంతో ఈ పోటీలను అటు పాఠశాల, ఇటు కళాశాల క్రీడాకారులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. కోనసీమ జిల్లా మలికిపురంలో రాష్ట్ర స్థాయిలో అండర్‌–14, 17 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ అండర్‌–14 పోటీలు జరగనున్నాయి. కాకినాడ డీఎస్ఏ మైదానంలో హాకీ, స్కేటింగ్, జిమ్నాస్టిక్స్, షార్ట్ టెన్నిస్, రగ్బీ (అండర్‌–17 బాలుర), తూర్పు గోదావరి జిల్లాలో హ్యాండ్‌బాల్ అండర్‌–17, షూటింగ్ అండర్‌–14, అండర్‌–17, అండర్‌–19, బాల్ బ్యాడ్మింటన్ అండర్‌–17 పోటీలు జరుగనున్నాయి.

ఈ ఏడాది నుంచి గ్రిగ్ పోటీలు

కొన్నేళ్లుగా నిలిచిపోయిన పాఠశాల స్థాయి గ్రిగ్ పోటీలను తిరిగి ఈ ఏడాది మొదలు పెట్టాలని ఆయా పాఠశాలలకు చెందిన వ్యాయామోపాధ్యాయులు, వెటరన్ క్రీడాకారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన తొలుత జోన్, తరువాత సెంట్రల్ జోన్ పోటీలు నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీతో కలుపుకొని మొత్తం ఎనిమిది జోన్‌లు ఉండేవి. ఇందులో విజేతలను సెంట్రల్ జోన్ (ఉమ్మడి జిల్లా అంతా కలిపి) పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు కూడా ఇదే పద్ధతిలో చేయాలని వారు సంకల్పించారు. ఇందుకు ప్రభుత్వ సహకారం అవసరం ఉన్నందున త్వరలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసేందుకు మూడు జిల్లాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నాయి.

త్వరలోనే అసోసియేషన్ క్రీడలు

ఉమ్మడి జిల్లాలోని పలు క్రీడాంశాలకు సంబంధించి నిర్వహించే అసోసియేషన్ల క్రీడలకు సైతం షెడ్యూల్ విడుదల కానుంది. ఇప్పటికే కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంలో అథ్లెటిక్స్ పోటీలు కోనసీమ జిల్లా స్థాయిలో జరిగాయి. కాకినాడ జిల్లాలో కూడా పూర్తయ్యాయి. మిగిలిన అసోసియేషన్లు కూడా ఆయా విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహణ



ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. మండల, నియోజకవర్గ స్థాయిలతో పాటు ఉమ్మడి జిల్లాలో ఈ పోటీలు జరుగుతాయి. ప్రతి మండల కేంద్రం, నియోజకవర్గంలో మైదానం ఉన్నచోట ఈ పోటీలు నిర్వహిస్తాం. ఈ సారి ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు పెద్దఎత్తున జరుగుతుండడంతో ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు మేలు జరగనుంది.

–అడబాల విజయ శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సముద్ర తీరంలో మహిళ మృతదేహం



నేమాం వద్ద మహిళ మృతదేహం

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం బీచ్ వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం సముద్రంలో శుక్రవారం కొట్టుకువచ్చింది. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు గల మహిళ మృతదేహం నేమాం వద్ద చౌదరి గెస్ట్ వెనుక భాగంలో సముద్రంలో ఒడ్డుకు వచ్చింది. మృతదేహంపై పచ్చరంగు జాకెట్, ఎరుపు రంగు లంగా, మెడలో ఎరుపురంగు తావీదు ఉంది. సముద్రంలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందా లేకుంటే ఏలేరు వరదలకు కొట్టుకువచ్చిందా అనేది విచారణలో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిస్తే 0884 2306332, 94407 96556 ఫోన్ నంబర్లకు తెలిపాలని పోలీసులు కోరారు.

బాలిక ఆత్మహత్యపై విచారణ



బాలిక ఆత్మహత్యపై ఆరా తీస్తున్న అధికారులు

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులో విద్యార్థిని హత్మహత్య ఘటనపై జిల్లా విద్యాశాఖాధికారి రమేష్, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి స్థానిక అధికారులతో కలసి శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 9వ తరగతి చదువుతున్న అంబేడ్కర్ కాలనీకి చెందిన బత్తిన దుర్గాభవాని గురువారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకుని విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, పాఠశాల వద్ద తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేపట్టారు. తగిన న్యాయం చేస్తామని అధికారులు వారికి భరోసా ఇచ్చారు. తహసీల్దార్ సూర్యప్రభ, ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై పవన్‌కుమార్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంఈఓ వి.రాజుబాబు, ఈఓపీఆర్డీ విశ్వనాథం తదితరులు ఉన్నారు.

చిక్కదు.. దొరకదు



9వ తేదీ అర్ధరాత్రి రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో ట్రాప్ కెమెరాకు చిక్కిన చిరుతపులి



ట్రాప్ కెమెరాలను అమర్చుతున్న సిబ్బంది

- దోబూచులాడుతున్న చిరుతపులి
- రిజర్వు ఫారెస్ట్ పరిసరాల్లోనే జాడలు

రాజానగరం: చిక్కదు.. దొరకదు అన్నట్లు చిరుతపులి దొరలా తిరుగుతోంది. లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో ప్రజలను హడలెత్తిస్తోంది. దీనిని పట్టుకునేందుకు అటవీ శాఖ అన్ని విధాలా ప్రయత్నిస్తున్నా ఫలితం ఉండటం లేదు. సీసీ, ట్రాప్ కెమెరాల్లో అక్కడక్కడా కనిపించినట్టే కనిపించి, అదృశ్యమవుతోంది. ఎనిమిది రోజులుగా ఇదే తంతు నడుస్తుంది. ఈ నేపథ్యంలో రిజర్వు ఫారెస్ట్ పరిసరాల్లో నివాసం ఉంటున్న వారే కాకుండా ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న 16వ నంబరు జాతీయ రహదారిపై ప్రయాణించే వారు, వ్యాపారాలు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. ప్రజలను హడలెత్తిస్తున్న చిరుతపులి లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో కనిపించీ, కనిపించకుండానే దోబూచులాడుతోంది. ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనం– హౌసింగ్ బోర్డు కాలనీల మధ్య ప్రాంతంలో చిరుతపులి ఒక జంతువును నోట కరుచుకుపోయిందని ఒక ప్రయాణికుడు ఇచ్చిన సమాచారం స్థానికుల్లో అలజడి రేపింది. ఇందులో నిజానిజాలను తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు 6వ తేదీ ఉదయం నుంచి చేపట్టిన గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అదే రోజు అర్ధరాత్రి లాలాచెరువులోని ఆకాశవాణి కేంద్రం వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఒక పందిని వెంబడిస్తూ పులి కనిపించింది. ఆ తరువాత దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు ఏరియాలో అప్పుడప్పుడు రెండు సార్లు ట్రాప్ కెమెరాలకు చిక్కింది. దానిని బంధించేందుకు రిజర్వు ఫారెస్ట్ ఏరియాల్లోని వివిధ ప్రాంతాల్లో అటవీశాఖ అమర్చిన ట్రాప్ కెమెరాలను 50కి పెంచారు. అవసరమైన పలుచోట్ల బోన్లను ఏర్పాటు చేశారు. అనుభవజ్ఞులైన అటవీశాఖ సిబ్బందితో ప్రత్యేక బృందాలను నియమించి, నిరంతరం గాలిస్తున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధంగా థర్మల్ డ్రోన్ కెమెరాను కూడా ఉపయోగించి శోధన చేస్తున్నారు. ఇన్ని చేసినా ఆ చిరుతపులి ఒక రోజు ఆయా కెమెరాలకు చిక్కి, రెండు రోజుకు జాడ లేకుండా పోతుంది.

అసత్య ప్రచారం చేస్తే చర్యలు

చిరుతపులి సంచారంపై కొంతమంది ఆకతాయిలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, కల్పితాలు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి భరిణి హెచ్చరించారు. చిరుతపులి దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్‌లోనే ఉందని, దాని పాదముద్రలను కూడా గుర్తించామని తెలిపారు. దానివల్ల ఇంతవరకూ ఎవరికీ ఎటువంటి ప్రాణనష్టం వాటిల్ల లేదన్నారు. దానిని పట్టుకునేందుకు బోనులను ఏర్పాటు చేశామన్నారు. లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్ట్ ఏరియాల వెంబడి ఉన్న జాతీయ రహదారిపై వెళ్లేవారు మరింత జాగ్రత్తలు పాటించాలని భరణి సూచించారు. అటు, నిటు పరిశీలిస్తూ నెమ్మదిగా వాహనాలపై వెళ్లాలని, ఇందుకు ఆయా వాహనాల వేగాన్ని నియంత్రిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన

- ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు
- పోక్సో చట్టం కింద కేసు నమోదు



శాటిలైట్‌సిటీ ఏ–బ్లాకు పాఠశాలలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిశోర్, డీవైఈఓ నారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. ఆ వివరాల ప్రకారం.. శాటిలైట్‌సిటీ గ్రామంలోని ఏ–బ్లాక్‌లో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఉంది. రెండో తరగతి మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయుడు పి.సన్యాసిరావు ఐదో తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల గేట్లకు తాళాలు వేశారు. ఈ విషయం తెలుసుకున్న బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై అంకారావు, సిబ్బందితో అక్కడకు చేరుకుని చర్చించారు. అయినప్పటికీ తల్లిదండ్రులు ఆందోళన విరమించకపోవడంతో జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు సౌత్ సెంట్రల్ జోన్ డీఎస్పీ భవ్యకిశోర్, విద్యా శాఖ నుంచి డీవైఈఓ నారాయణ, మండల విద్యాశాఖాధికారి తులసీదాస్ అక్కడకు చేరుకుని తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ నాలుగు, ఐదో తరగతిలో 11 మంది విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడు సన్యాసిరావు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్పీ భవ్యకిశోర్, డీవైఈఓ నారాయణ మాట్లాడుతూ సదరు ఉపాధ్యాయుడిపై విచారణ జరిపి తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో తల్లిదండ్రులు శాంతించారు. అనంతరం డీవైఈఓ నారాయణ, ఎంఈఓ తులసీదాస్‌లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరిచే విద్యార్థినుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం, బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకారావు తెలిపారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి శుక్రవారం శాటిలైట్‌సిటీ పాఠశాలలో విచారణ చేశారు. ఆ నివేదికను కలెక్టర్‌కు అందించారు. అనంతరం ఉపాధ్యాయుడు సన్యాసిరావును సస్పెన్షన్ చేస్తూ ఇన్‌చార్జి జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి వి.వెంకటరాజు ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ కాలంలో హెడ్ క్వార్టర్ విడిచి ఎక్కడకు వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

అన్నవరం: స్థానిక సత్యదేవ జూనియర్ కళాశాల మైదానంలో ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల బాలుర, బాలికల జట్లకు సంబంధించి సుమారు 260 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు వీర శంకరరెడ్డి, కార్యదర్శి రావు వెంకటరావు, చీఫ్ రిఫరీ ఎంవీఎస్ రాజు, తూర్పుగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు, అధ్యక్షుడు ఎం.వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు కడప జిల్లాపై, కర్నూల్ జిల్లా జట్టు పశ్చిమగోదావరి జిల్లాపై, శ్రీకాకుళం జిల్లా జట్టు నెల్లూరుపై, తూర్పుగోదావరి జట్టు విజయనగరంపై, అనంతపూర్ జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై గెలిచాయి. విశాఖ జిల్లా కృష్ణా జిల్లాపై, చిత్తూరు జట్టు గుంటూరుపై, కడప జట్టు తూర్పుగోదావరి జిల్లాపై, కర్నూల్ జట్టు విజయనగరంపై, శ్రీకాకుళం జట్టు అనంతపూర్‌పై గెలుపొందాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం జిల్లా జట్టు కడపపై, తూర్పుగోదావరి జట్టు నెల్లూరు జిల్లాపై, విశాఖ జిల్లా జట్టు పశ్చిమ గోదావరిపై, అనంతపూర్ జిల్లా జట్టు ప్రకాశంపై, గుంటూరు జట్టు విజయనగరం జిల్లాపై గెలిపొందాయి. శ్రీకాకుళం జట్టు చిత్తూరు జిల్లాపై, కర్నూల్ జిల్లా జట్టు కృష్ణా జిల్లాపై, ప్రకాశం జిల్లా జట్టు కడప జిల్లాపై, తూర్పుగోదావరి జట్టు అనంతపూర్ జిల్లాపై, విశాఖ జట్టు విజయనగరం జిల్లాపై గెలిపొందాయి.

సాంకేతిక పరిజ్ఞానానికి ఐఓటీ కీలకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి

గండేపల్లి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంలో ఐఓటీ ముఖ్య పాత్ర వహిస్తుందని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఐఓటీపై ఇంటరాక్టివ్ వర్క్‌షాప్ చివరిరోజు శుక్రవారం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక అంశాల నుంచి వృత్తి నైపుణ్యం వరకూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో ప్రత్యేక పునాది, సైద్ధాంతిక పరిజ్ఞానం అంశాలను వివరించారు. రిసోర్స్‌పర్సన్ ఎస్ఆర్‌కే మహేన్, హ్యాక్‌బోట్స్ ఏరియా ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ జమీల్ అలీ మొహమ్మద్, ఐఓటీ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ సుబోధ్ పాండా, ఈసీఈ విభాగాధిపతి వి.ప్రశాంత్, ప్రిన్సిపాల్ జి.నరేష్, డైరెక్టర్ హరనాథబాబు పాల్గొన్నారు.

కోత లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

11 నెలల బాలుడికి అరుదైన చికిత్స

కాకినాడ రూరల్: ఉభయ గోదావరి జిల్లాల్లోనే తొలిసారిగా ఎటువంటి కోత లేకుండా ఆత్యాధునిక ఆర్ఐఆర్ఎస్ ప్రక్రియ ద్వారా 11 నెలల బాలుడి కిడ్నీలో రాళ్లను మెడికవర్ ఆస్పత్రిలో వైద్యులు తొలగించారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆస్పత్రి సెంటర్ హెడ్ సుభాకర్ శుక్రవారం మీడియాకు తెలిపారు, కాకినాడకు చెందిన బాలుడు కొన్ని నెలలుగా తీవ్ర జ్వరం, కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. మూత్రం పోయడంలో ఇబ్బంది పడుతుండడంతో తల్లిదండ్రులు మెడికవర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు.

ప్రముఖ యురాలజిస్టులు కల్యాణ్‌బాబు, మణికంఠ బృందం బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించి, కిడ్నీలో రాళ్లున్నట్టు గుర్తించారు. అత్యాధునిక రెట్రోగ్రేడ్ ఇంట్రారెవల్ సర్జరీ(ఆర్ఐఆర్ఎస్) ద్వారా రాళ్లను తొలగించారు. మూడు రోజుల అబ్జర్వేషన్ తర్వాత బాలుడిని క్షేమంగా ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్యాణ్‌బాబు మాట్లాడుతూ, సాధారణంగా పోషకాహార లోపం, అధిక ఉప్పు వాడకం, మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వంటి కారణాలతో భారతదేశంలో కిడ్నీల్లో రాళ్ల వ్యాధి వస్తోందన్నారు. అయితే నవజాత శిశువుల్లో బయట పడడం అరుదన్నారు. ఆర్ఐఆర్ఎస్ అనేది ఎండోస్కోపిక్ శస్త్ర చికిత్స అని, ఇది మూత్ర నాళం నుంచి కిడ్నీకి చేరుకోవడానికి అనుమతిస్తుందన్నారు. ఈ రకమైన విధానాలకు యూరిటెరోస్కోప్ పరికరం ఉపయోగించి రాళ్లను తొలగించడానికి లేజర్ ఫైబర్(హోల్మియం లేజర్)ఉపయోగపడుతుందని వివరించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ కిశోర్ మాట్లాడుతూ బాలుడికి తక్కువ వయసు కావడంతో మత్తు ఇవ్వడంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.

కాలువలో జారిపడి వ్యక్తి మృతి



కాలువలో జారిపడి మృతి చెందిన జగిరెడ్డి శ్రీనివాసరావు

తుని రూరల్: తుని మండలం వెలంపేట సమీపం పోలవరం కాలువలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి శుక్రవారం తెలిపారు. రౌతులపూడి గ్రామానికి చెందిన జగిరెడ్డి శ్రీనివాసరావు (42) కాలకృత్యాలు తీర్చుకునేందుకు పోలవరం కాలువ వద్దకు వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.